www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 9 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



నీట మునిగిన వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-పీలేరు: మండలంలోని దొడ్డిపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం కెవికె ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి.ఎస్ పాండురంగ పరిశీలించారు. వరి పంట నేల కొరిగి నీట మునిగి మొలక కట్టడం గమనించారు. వరి పంట కోత దశలో ఉన్నందున వెంటనే పొలంలోని నీటిని కాలువల ద్వారా బయటకు తీయాలన్నారు. బూజు తెగులు, గింజ రంగు మారే అవకాశం ఉందని చెప్పారు. వర్షం తగ్గి ఎండ వస్తోంది కాబట్టి వెంటనే పంటను కోసి గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటర్ నీటికి 50 గ్రాములు) గింజలపై పడేవిధంగా పిచికారీ చేస్తే అవి మొలకెత్తకుండా రంగు మారకుండా నివారించవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారులు రమాదేవి క్షేత్రస్థాయి పరిశీలించి ఎంత మేరకు నష్టం వాటిల్లిందో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురి, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

- ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, కార్పొరేట్‌కు దీటుగా రాయచోటి వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి అంటే ప్రజలకు ధైర్యం, నమ్మకం భరోసా కలిగేలా సేవలు అందేలా చూడాలన్నారు. లీవ్, డిప్యుటేషన్లతో ఖాళీ వైద్యుల పోస్టులను తక్షణ గతిన భర్తీ చేసుకోవాలన్నారు. వంద పడకల ఆసుపత్రి ప్రారంభానికి ముందే ఇప్పటి నుంచే వసతులు పెంచాలన్నారు. ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి త్వరగా తీసుకు రావాలన్నారు. ఎసిలు, లిఫ్ట్ ఏర్పాటుపై చర్చించారు ఆక్సిజన్ ప్లాంట్ వాడకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఏపి విభాగాలకు ఎన్నిన్ని ఆక్సిజన్ బెడ్లు అవసరమో ఆయన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ టి.డేవిడ్ సుకుమార్‌తోనూ, వైద్యాధికారులతో ఆరా తీశారు. ఆక్సిజన్‌ను నిల్వ ఉంచే ఏర్పాట్లపై చర్చించారు.సమిష్టి కృషి సహకారంతో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించాలన్నారు. వైద్య పరీక్షల నిర్వహణపై ఆయన ఆరా తీశారు. నూతన భవనంలో సోమవారం నుంచే వైద్య సేవలు ప్రారంభం కావాలన్నారు. విభాగాల కేటాయింపు, వైద్య పరికరాలు ఏర్పాటు చర్యలను ఇప్పటి నుంచే ప్రారంభించాలన్నారు. తాగునీటి సరఫరా చర్యలను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. రోజూ సుమారు 750 మందికి పైగా ఒపి రోగులు వస్తున్నారని, వారికి నాణ్యమైన, సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. పరీక్షలలో మహిళలకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మెడికల్, సర్జికల్ విభాగాల నిర్వహణకు ఏడాదికి రూ.80 లక్షల మేర వ్యయం అవుతాయని అధికారులు తెలిపారు. ట్రామా కేర్, కార్డియాలజీ సేవల ఏర్పాటుకు కృషి చేద్దామన్నారు. ఆసుపత్రి పరిశుభ్రత, పారిశుద్యం మెరుగునకు మరింత చర్యలు చేపట్టాలన్నారు. ఆర్వో, రహదారుల నిర్మాణాలపై ఆయన ఆరా తీశారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీలోగా వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలను ప్రారంభించేందుకు సిద్ధమవుదామన్నారు. డయాలసిస్ కేంద్రం మరింత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్ర భవనాన్ని కూడా నూతన భవనాలలోని అన్ని వసతులతో కూడిన భవనంలోకి మార్చాలన్నారు. ప్రారంభానికి సిద్ధమవుతున్న నూతన భవనాలను శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్వో, రహదారుల నిర్మాణాలను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో మంచి చెట్లు నాటి పచ్చదనం పెంపొందించాలని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష వైద్యాధికారులకు సూచించారు. మానసిక ప్రశాంతత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా చేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బేపారి మహమ్మద్ ఖాన్, ఫమీదా, వైద్యాధికారులు డాక్టర్ బండారు కిరణ్ కుమార్, డాక్టర్ రెడ్డిమహేశ్వర రాజు, డాక్టర్ రెడ్డి భాస్కర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ ఖదీర్, ఏపిఎంఎస్ఐడిసి డిఇ రాజగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు ఆసిఫ్ అలీఖాన్, కొలిమి ఛాన్ బాష, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, గౌస్ ఖాన్, కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, అన్నా సలీం, కొత్తపల్లె ఇంతియాజ్ పాల్గొన్నారు.

ప్రశ్నించేనా?



జిల్లాలో ఒకవైపు కరువు, మరోవైపు వరద వంటి విచిత్ర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం ఆసక్తిని కలిగిస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో వర్షాభావ పరిస్థితులు నెల కొనడంతో వ్యవసాయ రంగం కుదేలైంది. ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. కడప నగర రహదారుల విస్తరణ దగ్గర నుంచి రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ భవన నిర్మాణ పనులు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులు, ఉక్కు పరిశ్రమ పనుల్లో పురోగతి, కొప్పర్తి పైప్‌లైన్ పనుల నత్తనడకన సాగుతున్న తీరుపై ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు.. ప్రతిపక్ష టిడిపి నుంచి పాలకపక్ష తప్పిదాలను నిలదీసే అవకాశాలు సన్నగిల్లిన నేపథ్యంలో సమగ్ర చర్చ దేవతావస్త్రంలా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో కథనం..

- కరువు, వరదలపై సమగ్ర చర్చ అవసరం
- ఉక్కు పరిశ్రమ పనుల్లో కొరవడిన పురోగతి
- అన్నమయ్య ప్రాజెక్ట్ నిర్వాసితులకు స్వాంతనేదీ
- 'కొప్పర్తి' పైప్‌లైన్ ఏర్పాటు ఎప్పుడో?!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో కరువు కరాళ నృత్యం చేస్తోంది. పదేళ్లలో ఎన్నడూ లేని రీతిలో క్షామపీడిత పరిస్థితులు నెలకొన్నాయి. మిచౌంగ్ తుపాన్ కారణంగా జిల్లాలో 20 వేల ఎకరాల్లో పంట నేలపాలు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఒక వైపు కరువు, మరోవైపు వరద పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ రంగం అథ:పాతాళానికి చేరువైంది. ఇటువంటి పరిస్థితుల్లో కరువు, వరద పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవాలని కోరుతూ తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉరుముతోంది. కడప నగరంలో రహ దారుల విస్తరణ ఏళ్ల తరబడి సా...గుతుంతోంది. కడప నగరంలోని ముంపు ప్రాంతాల పరిరక్షణకు ప్రకటించిన స్ట్రోమ్ డ్రెయిన్ పనుల్ని నిధుల కొరత వేధిస్తోంది. ఖరీఫ్‌లో నాలుగింట ఒక వంతు మాత్రమే సాగైన సంగతి తెలిసిందే. ఖరీఫ్ సాగుకు పోటీగా రబీ సీజన్ సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రబీ సాగుపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది.

అన్నమయ్య, గండికోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్‌ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టి కట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ నిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కనిపించ లేదు. పింఛా, ఎల్‌ఎస్‌పి గేట్లకు మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీల పరిష్కారం, యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియడం లేదు. గండికోట నిర్వాసితులకు రూ. ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లా జీవనాడిగా మారిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేయడం సరే, పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మూడు అడుగు ముందుకు ఆరుఅడుగులు వెనక్కి చందంగా మారింది. ఈ ఏడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించక పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొప్పర్తికి రూ.150 కోట్ల నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఫలితంగా జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలక వర్గం జిల్లా సమగ్రాభివృద్ధి అర్థ వంతమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

నేడు జాతీయ లోక్ అదాలత్ : జిల్లా జడ్జి

ప్రజాశక్తి-కడప

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి.ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. న్యూఢిల్లీ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం కడప జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కడపలో 6 బెంచీలు, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 1, రాయ చోటిలో3, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 08562 258622, 244622 సంప్రదించాలని పేర్కొన్నారు. ఈమెయిల్ అడ్రస్: districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజి చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, పరిష్కార సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 1902కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ నెల 15 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి-మహిళా శక్తి అనే ప్రత్యేక పథకం ద్వారా జీవనోపాధికి సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోందన్నారు. ఈ పథకం కింద నలుగురుకి ఆటోలను అందించామన్నారు. కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆర్‌డిఒ మురళి, డిఎల్‌పిఒ నాగరాజ, డిఎల్‌డిఒ లక్ష్మీపతి, మండల ప్రత్యేక అధికారి శివరామమూర్తి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎస్ఐలు నాగేశ్వర రావు, కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జెసి, ఎమ్మెల్యే

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గిరిష పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంస్థ ఎస్‌కెఎఫ్‌డిసి పథకం ద్వారా మంజూరైన మురుగునీటి శుద్ధి వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం వివిధ సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో స్వచ్ఛత ఉద్యమి యువజన పథకంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో పనిచేయుచున్న సఫాయి కర్మచారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.31.67 లక్షల విలువ చేసే మురుగునీటి శుద్ధి వాహనాన్ని మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ సబ్సిడీ రూ.15.06 లక్షలు కాగా మిగిలిన రూ.16.60 లక్షలు 72 కంతులలో లబ్ధిదారుడు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఇడి వెంకటసుబ్బయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి వాహన పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ గిరీష



దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న నరహరి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం అందించాలని రాజంపేట టిడిపి పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మిట్టమీదపల్లె, శవనవారిపల్లె గ్రామాలలో పర్యటించి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. శవనవారిపల్లె గ్రామానికి చెందిన దుగ్గినేని రాజా తన 5 ఎకరాల అరటి, దుగ్గినేని మల్లికార్జున్ అనే రైతు 8 ఎకరాల అరటి తోట పూర్తిగా ధ్వంచమైందని, తమను ఆదుకోవాలని నరహరి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వం నుంచి రావలసిన నష్టపరిహారం పూర్తిగా వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రజలను కోరారు. అనంతరం శవనవారిపల్లె మాజీ సర్పంచ్ దుగ్గినేని వెంకటసుబ్బయ్య నాయుడును తన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, మంచాల కోటయ్య నాయుడు, రాజా, నాగ మునిరెడ్డి, సంతోష్ నాయుడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ విష్ణుకు కార్డియాలజీలో డిఎం సీటు

ప్రజాశక్తి-పీలేరు



పీలేరుకు చెందిన డాక్టర్ విష్ణు శంకర్‌రెడ్డి కార్డియాలజిస్ట్ కోర్సులో సీటు సాధించారు. పీలేరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్.రవిశంకర్‌రెడ్డి, డాక్టర్ శ్రీలత దంపతులు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తమ కుమారుడు డాక్టర్ ఆర్.విష్ణుశంకర్‌రెడ్డి నీట్లో ర్యాంకు సాధించి బెంగుళూరులోని ఎంఎస్ రామ య్య వైద్య కళాశాలలో డిఎం కార్డియాలజీ విభా గంలో సీటు సాధించారన్నారు. కర్నాటక రాష్ట్రం, కోలారులోని ఎస్‌డియు ఎంసిలో ఎంబిబిఎస్, బెంగళూరులోని ఆర్‌ఆర్‌ఎంసిలో ఎమ్‌డి పూర్తి చేసుకున్నారన్నారు. ప్రస్తుతం రామయ్య మెడికల్ కళాశాలలో కార్డియాలజీ విభాగంలో డిఎం కోర్సుకు ఎంపికైన విష్ణును పట్టణ ప్రముఖులు అభినందించారు.



ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారులు

పశు వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మిచౌంగ్ తుపాన్ ప్రభావ ఉపశమన చర్యల్లో భాగంగా శుక్రవారం మందరం, గొల్లపల్లిలో అత్తిరాల పశు వైద్యాధికారి భాగ్యవతి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 77 పాడి పశువులకు గొంతు వ్యాధి టీకాలు, 255 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 180 పాడి పశువులు, గొర్రెలు, మేకలకు పిడుదుల నివారణ కార్యక్రమం నిర్వహించినట్లు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయ భాస్కర్‌రావు పేర్కొన్నారు. పశు ఆరోగ్య సంరక్షణ కార్డుతో పాటు రైతులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, జెవిఒ వరదయ్య, ఎహెచ్ఎ విద్యాసాగర్, గోపాలమిత్ర భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రెడ్డిసాహెబ్

ప్రజాశక్తి-మదనపల్లి

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రెడ్డిసాహెబ్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లాబకాష్ ప్రకటిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి అప్పగించిన కాంగ్రెస్ పెద్దలకు, జిల్లా అధ్యక్షులు అల్లాబకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి, జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఆ దిశగా కార్యాచరణను రూపొందించుకుని విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెడ్డిసాహెబ్ నియామకంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మదనపల్లె మండల పార్టీ అధ్యక్షుడిగా వై.సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లె మండలాధ్యక్షుడిగా ముబారక్‌ఖాన్‌కు పదవీ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు అల్లాబకాష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ పీర్, ఎస్.కె.బాషా, మహమ్మద్ అలీ, బక్షు, నాగరాజ, చల్లా నాని, పాలేటి, సయ్యద్, శరత్రెడ్డీ, సోము, బయ్యా రెడ్డీ, అర్బాజ్ రవి, చెన్నకృష్ణ, రూతూ, మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిధి వసూళ్లలో పాల్గొన్న ఎన్‌సిసి విద్యార్థులు

'మిట్స్'లో సైనిక దళాల పతాక దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా భారత సైనిక దళాల పతాక దినోత్సవాన్ని ఎన్‌సిసి. క్యాడెట్స్ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ మాతృభూమి కోసం తన, ధన, మాన, ప్రాణాలను ఫణంగా పెట్టిన వీర జవానులను స్మరించుకున్నారు. దేశంలో ఉన్న ప్రజలందరూ సుఖఃసంతోషాలతో జీవిస్తున్నారంటే సరిహద్దులలో ఉన్న మన వీర జవానుల యొక్క త్యాగ ఫలితమని పేర్కొన్నారు. ఎన్‌సిసి ద్వారా దేశం కోసం పనిచేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మాతృభూమికి కోసం త్యాగ నిరతిని అందించి దేశ ప్రజలందరినీ సుఖశాంతులతో ఉంచిన సైనిక వీర జవానులకు కృతజతలు తెలిపారు. కార్యక్రమంలో మిట్స్ ఎన్‌సిసి క్యాడెట్స్ వీర జవానుల సాహసాన్ని గుర్తుచేసుకొని, మేము కూడా అవకాశం వస్తే దేశ రక్షణలో పాల్గొంటామన్నారు. ఎన్‌సిసి క్యాడెట్స్ కళాశాలలో వీర జవానుల సహాయార్థం సుమారు రూ.10 వేల విరాళాలను సేకరించారని, సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్ కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు

ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన పూర్తి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పక్కాగా పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తి అయిందని తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేస్తున్నామని ఇందులో ఎటువంటి సందేహాలున్న వెంటనే తెలియజేయాలన్నారు. డెత్, షిఫ్టెడ్, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు మరలా పరిశీలించడం జరిగిందని డెత్ ఓటర్లకు సంబంధించి డెత్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వచ్చే సాధారణ ఎన్నికలలో 18 ఏళ్లు పూర్తయిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని కళాశాలలు, డిగ్రీ కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఎన్‌రోల్ చేస్తామన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరినీ ఓటరుగా ఫార్మ్ 6 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గతంలో డిలీట్ అయిన ఓట్లను బిఎల్వోల ద్వారా పోలింగ్ స్టేషన్ ల వారీగా పరిశీ లించడం జరిగిందన్నారు. ఈనెల 9వ తేదీన అన్ని పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓ లను అందుబాటులో ఉంచి ఓటర్ ఎన్రోల్ చేసుకోవడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక అతి సమశ్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మహిళా పోలీసులను నియమించి మహిళా ఓటర్లకు సహకరించడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా వెంటనే పేపర్ రూపంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

తులసిరెడ్డిని కలిసిన శ్రీనాథ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ శుక్రవారం వేంపల్లిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు శ్రీనాథ్ తెలిపారు. పార్టీలో యువత చేరికపై ఆసక్తి చూపుతున్నట్లు ఆయనకు వివరించారు. త్వరలోనే భారీ సంఖ్యలో యువత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తులసిరెడ్డికి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మిశెట్టి హరినాథ్, బాదనపురి శివ, సీమకుర్తి వంశీ పాల్గొన్నారు.



రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యసిబ్బంది

నడిపిబట్టవారిపల్లెలో వైద్య సేవలు

ప్రజాశక్తి-కలకడ

నడిపిబట్టవారిపల్లెలో వైద్యసేవలు నిర్వహించినట్లు ఎర్రకోటపల్లి వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ నడిపిబట్టవారిపల్లెలో ఉన్న గ్రామస్తులకు వివిధ రకాలైన జబ్బులకు వైద్యసేవలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో ప్రస్తుత వర్షాకాల ప్రభావం వల్ల జలుబు, జ్వరము, దగ్గు, మలేరియా, టైఫాయిడ్, డెంగి వంటి జ్వరాలను క్రమబద్ధీ కరించ డానికి మందు స్ప్రే గ్రామంలో వైద్య సేవ నిర్వహించినట్లు తెలిపారు. జ్వరంతో బాధ పడుతున్న వారికి 104 సేవ ద్వారా రక్తపరీక్షలు నిర్వహించి ల్యాబ్‌కు పంపించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుత కాల పరిస్థితుల వల్ల జ్వరాలు రావడం జరుగుతుందని గ్రామీణ ప్రాంత ప్రజలు దోమలు నివారణకు దోమతెరలు వాడాలని, వేడిచేసుకొని నీటిని తాగాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గత పరిశుభ్రతను పాటించాలని అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో తన టీము నిర్వహించి విద్యార్థులకు తగు సూచనలు సలహాలు అందించినాను. ప్రతి విద్యార్థి భోజనాలు చేయకముందు చేతు లను పరిశుభ్రంగా కడుక్కోవాలని, భోజన అనంతరం కూడా చేతులను శుభ్రంగా కడుక్కొని పరిశుభ్రతపై శ్రద్ధ చూపించాలని సూచించినట్లు తెలిపారు. అనం తరం ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. అన్నారు. కార్యక్ర మంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, వైద్యసిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న వైసిపి నాయకులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు పాగొండ ఖలీల్ అహ్మద్ జన్మదిన వేడుకలను శుక్రవారం వైసిపి శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పాలు, పండ్లు, బ్రెడ్ అందించారు. పట్టణంలోని జ్యోతి బస్టాండ్‌లో అభిమానులు,మండల నాయకుల సమక్షంలో బాణా సంచా పేల్చి ప్రజలకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, వైసిపి మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు సీఆర్ చిన్నికృష్ణ, ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, మండల కో-ఆప్షన్‌మెంబర్ నాసర్, భీమగాని ప్రభాకర్ రెడ్డి, రాయల్ సలీం, అయ్యపురెడ్డి, నరసింహానాయుడు, సక్కా సంతోష్,షేక్ ముజీర్, చాంద్‌బాషా, రమేష్‌రెడ్డి, సద్దాం, పాగొండషఫీ, నరసింహానాయుడు, అఖిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-గాలివీడు

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ సభాభవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సమావేశాలు రికార్డుల నిర్వహణ, పంచాయతీ ఆదాయవ్యయాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామాల అభివృద్ధితోపాటు పంచాయతీరాజ్ సర్వీసెస్ కూడా వృద్ధి పొందించుకుంటూ పోవాలని తెలిపారు. గ్రామాలకు నిధులను పెంచుకునే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పాఠశాల ప్రహరీ పక్కన వ్యర్థాలను తొలగిస్తున్న జెసిబి


పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

పాఠశాల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. గాలివీడు గ్రామంలో ఎన్నో సంవత్సరాలనుంచి రోడ్డు పొరకారానికి నోచని బుట్టిగారి పల్లి, శెట్టివారి, డీలక్స్‌హోటల్, బుర్రలవీధులకు సిసి రోడ్డును ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. బాలుర ఉన్నతపాఠశాల చుట్టూ ఉన్న వ్యర్థపదార్థాలను, అపరిశుభ్రతను తొలగించి పరిసరాలను అందుబాటులో ఉంచామని పేర్కొ న్నారు. జెసిబి యంత్రాన్ని ఉపయోగించి పాఠశాల ఆవరణమంతా శుభ్రపరచడం చేశామన్నారు. ఈ సందర్భంగా ఎంపిపికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులున్నా ఉపాధ్యాయులు లేరు

చిట్వేలి : ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు మూల పడుతున్నాయని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి బాలకృష్ణయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చెర్లోపల్లి పాఠశాలను ఆయన పరిశీలించి, స్థానికులతో కలిసి ఎంఇఒ. ఈశ్వరయ్యకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉండడం సరి కాదని అన్నారు. మండలంలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండడంతో ప్రయివేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. సుమారు మండలంలో 30 ఉపాధ్యాయుల పోస్టులు పైగా ఖాళీలు ఉన్నాయంటే చిన్న వయసులో పిల్లల పరిస్థితి ఏంటో ఆలోచించాలన్నారు. నాడు-నేడు అంటూ పాఠశాల రూపురేఖలు మార్చినా పిల్లలకు విద్య బోధించు ఉపాధ్యాయులు లేకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ ప్రయివేట్ పాఠశాల వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామంలో పాఠశాల చెరువు ముందర ఉండడం ఉపాధ్యాయులు రాకుంటే పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. వెంటనే పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్ర మంలో చెర్లోపల్లి గ్రామస్తులు శివమణి, సుబ్రహ్మణ్యం, మణి, రమేష్ రోహిత్ పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న బాలకృష్ణయాదవ్

నగర పంచాయతీ భవన నిర్మాణానికి

అడ్డుగా పాల శీతలీకరణ కేంద్రం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ భవన నిర్మాణానికి పాలశీతలీకరణ కేంద్రం అడ్డుగా మారింది. బి.కొత్తకోట పంచాయతీగా ఉన్నప్పుడు 2009లో పాల సేకరణ కేంద్రానికి అప్పటి పాలకమండలి ఎటువంటి రుసుము లేకుండా భవనాన్ని కేటాయించారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి బాడుగ చెల్లించకుండా ఇన్నేళ్లు పాల సేకరణ కేంద్రానికి కేటాయించడం మంచి విషయమే. ప్రస్తుతం నగర పంచాయతీ ఆవరణంలో పంచాయతీకి సంబంధించిన స్థలంలో ఉండడంతో భవన నిర్మాణానికి ఇబ్బందికరంగా మారింది.ఈ విషయం పాల సేకరణ అధికారులకు తెలియపరచి గడవు కూడా ఇచ్చినా ఇంకా పాల సేకరణ కేంద్రం మరొక చోటకి ఇంకా మార్చ కపోవడంతో నగర పంచాయతీ నూతన భవనం నిర్మాణం జరిగేనా అనే సందేహాలు ప్రజల్లో మొదలవుతున్నాయి. భవనం పనులు మొదలు పెట్టేలోపు ఎన్నికల కోడ్ కూడా వస్తుందని పలువురు ప్రజల అభిప్రా యపడుతున్నారు.ఈ విషయంపై కమిషనర్ పి.ఆర్.మనోహర్‌ను వివరణ కోరగా ఈ విషయాన్ని పాలకేంద్రం వారికి తెలియపరిచామని,వారు మరొక చోట ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.త్వరగా మరొకచోట పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసుకుంటే నగర పంచాయతీ భవనం నిర్మించేందుకు శ్రీకారం చుడుతామని ఆయన స్పష్టం చేశారు.



పాలశీతలీకరణ కేంద్రం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం :'కొరముట్ల'



రైతుకు నష్టపరిహారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. రైల్వేకోడూరు మండలంలో ఇటీవల మిచౌంగ్ తుపాన్ దాటికి విపిఆర్ కండ్రిగ పంచాయతీలో నెలకొరిగిన అరటి, బొప్పాయి, మామిడి, పంటల రైతులతో సచివాలయంలో రైతులు,కౌలు రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని స్థానిక విపిఆర్ కందిక సొసైటీ అధ్యక్షుడు సుదర్శన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొరముట్ల మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పంటనష్టంపై ఆరా తీసి నివేదికలు తెప్పించుకొని ఇప్పటికే కొంతమంది బాధితులకు నష్ట పరిహారం అందించారని అన్నారు. రాని వారు అధైర్య పడవద్దని ప్రతి ఒక్క రైతుకు, కౌలు రైతుకు తప్పకుండా పరిహారం అందిస్తామని తెలిపారు. గతంలో 1992లో అగ్నికి ఆహుతైన పలువురి రైతుల భూముల రికార్డులు కాలి పోయినందున ఆ సమస్య ఎమ్మెల్యే దృష్టికి రాగా వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి వారికి కూడా నష్టపరిహారం అందేలా, శాశ్వత హక్కు పత్రాలు కూడా ఇప్పిస్తామని హామీనిచ్చారు. రైతు శివరామరాజుకు రెండు లక్షలరూపాయల నష్టపరి హారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సినియర్ నాయకులు కొల్లం , జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి, ధ్వజారెడ్డి ,స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ హేమనవర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బ రామరాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, విపిఆర్ కండ్రిక సొసైటీ అధ్యక్షుడు సుదర్శన్ రాజు, మాజీ శాప్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, సర్పంచ్ రమేష్, ఎంపిటిసిలు ప్రసాద్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 26వ రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 12 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 330 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులనే కాకుండా క్రీడల్లో కూడా తమ ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడలలో తన ప్రతిభకు గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎ. నిర్మల్ కుమార్ ప్రియ, ఆర్‌యుడి, ఎస్‌విఆర్ రీజినల్ , తిరుపతి, కలికిరి ఎంపిపి నూర్జహాన్, జడ్‌పిటిసి కాకర్ల పద్మజ, డాక్టర్ ఎస్. శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డా.యం. శివరామక్రిష్ణ, ఇసిసి విభాగాధిపతి, బి. శాంబశివరెడ్డి, ఇఇఇ విభాగాధిపతి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-నందలూరు

విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరు ప్రోత్సహిస్తే వారు ఏ రంగంలోనైనా రాణించగలరని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబుసూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఇసుకపల్లె ప్రాథమిక పాఠశాలలోని భవితా కేంద్రంలో ఎస్‌టిఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర దేవి ఆధ్వ ర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంత కృష్ణ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ పిల్లలకు ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు , వీల్ చైర్లు లాంటి ఉపకారణాలు, రవాణా, స్టైఫండ్ లాంటి ఉపకార వేతనాలు ఉచితంగా ఉచితంగా అందించడం జరుగుతుందని వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. రాజంపేట వికలాంగుల సంఘం అధ్యక్షులు అబ్దుల్లా మాట్లాడుతూ నేడు వికలాంగులకు చదువు లోనూ, ఉద్యోగాల లోను నాలుగు శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పిస్తున్నదని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నందలూరుకు చెందిన జాతీయ స్థాయి క్రికెటర్ శివకోటి మాట్లాడుతూ వికలాంగులని హేళన చేయకుండా ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణించ గలరని అన్నారు. ఎస్ టి ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో, చిత్రలే ఖనం, ఆటల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్క దివ్యాంగ పిల్లలకు జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్ మండల కో ఆప్షన్ సభ్యులు కలీం చేతుల మీదుగా బహుమతులు, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లీలా కృష్ణ, ఉపాధ్యాయులు పుల్లయ్య, లక్ష్మీనారాయణ, జిల్లా బిసి నాయకులు హిమగిరినాథ్ యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'మహిళల అభ్యున్నతికి పెద్దపీట'

ప్రజాశక్తి-కలికిరి

శ్రీశక్తి ఆధ్వర్యంలో స్థానిక మండలంలోని ఇద్దరు డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ద్వారా ఆటోలు పంపిణీ చేసినట్లు ఏరియా కో-ఆర్డినేటర్ రూతు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్, ఆర్‌డిఒ మురళి పాల్గొన్నారు. కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన కె కవిత, ఎస్‌టి కాలనీకి చెందిన ఎస్.లక్ష్మీదేవికి వీటిని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుషులకు సమానంగా మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని సదు ద్దేశంతో మహిళలకు కూడా ఆటోలు ఇచ్చి ఆర్థిక భరోసాతో పాటు ఆర్థిక స్వాలంబన కోసం ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధి పొందిన మహిళలు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి సహకారంతో స్థానిక ఆటో యూనియన్ లీడర్ ఎస్‌టిడి హరి చొరవతో మాకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి హరి, నాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే , జెసి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాలాజీ

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

పుల్లంపేట-ప్రజాశక్తి

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా మాదని, వారిని ఇంటి వద్ద బాగా చదివిస్తూ వారికి మద్దతుగా నిలవడం తల్లిదండ్రుల వంతు అని ఎస్‌బివిడి విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రిన్సిపల్ బాలాజీ తెలిపారు. శుక్రవారం పుల్లంపేట ఎస్‌బివిడి జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎంతో విలువైన కాలమని, అందుకే సాయంత్రం మూడు నుంచి ఐదు వరకు జూనియర్ కళాశాలలో స్టడీ అవర్స్ నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కళాశాలలో తాము విద్యతోపాటు వారికి క్రమశిక్షణ నేర్పుతామని చెప్పారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈకళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని, తమ తమ పిల్లలు కూడా ఇక్కడే చదువుకుంటున్న సందర్భంగా వారి భవిష్యత్తుకు కళాశాల యాజ మాన్యం బంగారు బాటలు వేస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌టిఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున

తంబళ్లపల్లి : ప్రజాసంకల్ప వేదిక ఆర్‌టిఐ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా బురుజుపల్లి చెందిన చన్నక మల్లికార్జున ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రజాసంకల్పన వేదిక ఆర్‌టిఐ రాష్ట్ర అధ్యక్షులు మదిరే రంగసాయి రెడ్డి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. సమాచార హక్కు చట్టం- 2005 గురించి గ్రామాల్లో ప్రజలను యువతను అవగాహన కార్యక్రమాలతో చైతన్య పరుస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆర్‌టిఐ 2005 చార్టులను ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

తంబళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో సిడిలు, పిఇటిలు , సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఆడదాం ఆంధ్రయాప్‌పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాయచోటికి చెందిన రిసోర్స్ పర్సన్‌లు రవీంద్ర, హజహార్ ఆలీలు యాప్ నిర్వహణ క్రీడా కారుల టిమ్, ఎంపిక ఆటల పోటీల నిర్వహణ, క్రీడాకారుల అవుట్ అయిన తీరు, ఆన్‌లైన్ స్కోరు తదితర అంశాలను యాప్‌లో పొందు పరిచేతీరుపై వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సురేంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి

నవరత్నాలతో గ్రామీణాభివృద్ధి

ప్రజాశక్తి-గాలివీడు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో గ్రామీణాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని గాలివీడు గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు-2 సచివాలయంలో జగనన్న సంక్షేమ పథకాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-1 యధుభూషణ్‌రెడ్డి, ఎంపిడిఒ శేఖర్ నాయక్ వైస్ ఎంపిపి-2 గాలి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సెక్రెటరీ రాధికారెడ్డి, ఎస్.కె నిజాముద్దీన్, గంగాధర్‌నాయుడు, వార్డుమెంబర్ రవీంద్రారెడ్డి, వెంకటరమణ, సగినాల శ్రీను, మహేంద్రబుషన్ నాయుడు సచివాలయ ఎన్‌ఎంలు, పోలీసులు పాల్గొన్నారు.



జనావాసాల మధ్యలో కుంటలను తలపిస్తున్న వర్షం నీరు

కుంటలను తలపిస్తున్న వర్షపు నీరు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని చిట్వేలి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షాలకు సైతం వర్షపు నీరు పోయే అవకాశం లేక చిన్నచిన్న నీటి కుంటల్లాగా తయారవుతున్న దుస్థితి ఏర్పడింది. ఎంతో విశాల ఆయకట్టు కలిగిన ఎల్లమరాజు చెరువు కింద ఉన్నటువంటి పంట కాలవలు చిట్వేలి చుట్టుపక్కల కబ్జాదారుల కనుసన్నల్లో కాలువలు కనుమరుగైపోగా వాటిని పరిరక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు మాత్రం ఆఫీసులకు పరిమితమయ్యారే తప్ప పరిష్కారం వైపు అడుగులు వేయలేదని ప్రజల నుంచి విమర్శిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన అది ఇరిగేషన్ వారికి సంబంధించిందని వారు మాటదాటవేస్తున్నారని అన్నారు. జనావాసాల్లో వర్షపు నీరు ఇంకిపోయే వరకు అటు దోమల బెడదతో పాటు విషపురుగులతో ఇబ్బందులు గురవుతున్నారని స్థానిక గృహిణులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి పంట కాలువలు ఆక్రమణలను తొలగించి నీరు నిలవలు లేకుండా ఉండేందుకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రజల చూపు కాంగ్రెస్ వైపు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ వరసగా విజయాలు సాధించుకుంటూ దూసుకపోతువుందని, రాష్ట్ర ప్రజలచూపు కూడా హస్తం వైపు మళ్లిందని జిల్లా డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. కర్ణాటకలో విజయం సాధించి అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మరల తెలంగాణలో భారీ మెజార్టీతో విజయం సాధించి తెలంగాణలో కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.మన రాష్ట్ర ప్రజలు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో , జిల్లాలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ : మహిళ మృతి

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఓ చిన్నారితో సహా నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం కెవిపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..సుండుపల్లి మండలం, బాగంపల్లికి చెందిన సైపుల్లా (32) తిరుపతిలో ఉన్న తన భార్యను చూసేందుకు తన తల్లి చాంద్‌బీ(55), ఏడాదిన్నర వయస్సు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాని అన్నారు. వగళ్లకు చెందిన రెడ్డిప్రసాద్, నారమాకులవడ్డిపల్లికి చెందిన ఆర్.శ్రీనివాసులు మరో ద్విచక్ర వాహనంపై అదే మార్గంలో వస్తూ ఇరు వాహనాలూ నారమాకులవడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఢీ కొన్నాయని తెలిపారు. ఈ ప్రమాదంలో చాంద్‌బీ రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిందని చెప్పారు. ప్రమాద సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టామన్నారు. మృత దేహంతో సహా క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిం చామని చెప్పారు. గాయపడిన వారికి వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి పంపించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

ములకలచెరువు : మండలం కదిరినాధునికోట పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన అజ్మీర్ (47) గురువారం సాయంత్రం సొంత పని మీద తన గ్రామనికి వెళ్లి వస్తుండగా స్థానిక కెజిఎన్‌కల్యాణ మండపం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన స్థలానికి ఎస్ఐ గాయత్రి చేరుకొని గాయపడ్డ బాధితుడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐతెలిపారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

మదనపల్లి : కడపునొప్పి తాళలేక సిఎ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం వేకువ జామున మదనపల్లిలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. పెద్ద తిప్ప సముద్రంనకు చెందిన స్వాతి(21) కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా మదనపల్లికి తరలించినట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాటుసారా నిందితుడు అరెస్టు

తంబళ్లపల్లి : మండలంలో నాటుసారా అమ్మేందుకు సిద్ధం చేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోట కొండ ఎగువ సుగాలితండాకు చెందిన శీనానాయక్ నాటుసారా తరలించేం దుకు సిద్ధం చేసి ఉండగా తమ సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి తొమ్మిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.

కలకడలో పది లీటర్లు స్వాధీనం..

కలకడ: పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.స్థానిక పోలీసులు సమాచారం వరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వానకు చెందిన రమేష్ అనే వ్యక్తి నాటుసారా తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు.ఈ దాడులలో కోనక్రాస్ వద్ద పదిలీటర్ల నాటుసారా తరలిస్తున్న రమేష్‌ను పట్టుకొని అతని వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.